
మెదక్ పట్టణ వ్యూ

- ప్రజలకు సౌలభ్యం.. స్థానికతకు ప్రాధాన్యం
- జిల్లా విభజనతో ప్రజలకు పాలన చేరువ
- మెదక్ జిల్లాకు నాలుగు రెవెన్యూ డివిజన్లు
- 21 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 469 జీపీలు
- కొత్త జిల్లా నుంచి సజావుగా సాగుతున్న పాలన

# చేరువైన పాలన

మెదక్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. 2016 అక్టోబర్‌కు ముందు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాలు మాత్రమే ఉండేవి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం 1974 ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా 23 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి 2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లాను కూడా ఏర్పాటు చేశారు.

## రాజ భవనంలా ఎస్పీ కార్యాలయం



జిల్లాలో ఎస్పీ కార్యాలయాన్ని అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాజ భవనాన్ని తలపించే హంగులు, గాలి, వెలుతురు, సూర్య రశ్మి వచ్చేలా విశాలమైన గదులు ఇలా అందరినీ ఆకట్టుకునేలా జిల్లా పోలీసు కార్యాలయాన్ని నిర్మించారు. జిల్లా కేంద్రంలోని ఔరంగాబాద్ శివారులోని సర్వే నంబర్ 78లో కలెక్టరేట్ కార్యాలయ భవనం పక్కన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. 63 ఎకరాల్లో మూడు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టారు. కార్యాలయ భవనంతోపాటు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నివాస గృహాలు ఒకే ప్రాంగణంలో నిర్మించారు. ముందు లాండ్ స్కేప్, పార్కింగ్, అంతర్గత రహదారుల నిర్మాణం మినహా ప్రధాన భవన నిర్మాణంలోని గదులు తుది మెరుగు దశలో ఉన్నాయి. రాజ భవనాన్ని తలపించేలా అన్ని వసతులతో నిర్మించారు. ఆగస్టు 23న సీఎం కేసీఆర్ ప్రారంభించారు.

### పరిపాలనా సౌలభ్యం కోసం

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాను 4 రెవెన్యూ డివిజన్లుగా విభజించారు. ఇందులో మూడు పాత రెవెన్యూ డివిజన్లు మెదక్, నర్సాపూర్, తూప్రాన్ కాగా, నూతనంగా ఒక్క రెవెన్యూ డివిజన్ రామాయంపేట ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా ఏర్పాటు నాటికి జిల్లా కేంద్రంలో ఒక మున్సిపాలిటీ ఉండగా, నేడు కొత్తగా 3 మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకొని పరిపాలనను పట్టణ ప్రజలకు చేరువలోకి తీసుకువచ్చారు.

### గంటలోనే పనులన్నీ..

జిల్లా కేంద్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాలు ప్రజల అవసరాలకు అనుకూలంగా ఏర్పాటు చేశారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ప్రభుత్వ శాఖలన్నింటిలో నూతన విభాగాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు జిల్లా కేంద్రానికి రావాలంటే గంట వ్యవధిలోనే వస్తున్నారు.

### మెదక్ జిల్లా ఏర్పాటు

రాష్ట్రంలో అన్ని జిల్లాల మాదిరిగానే మెదక్ జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి మెదక్ జిల్లాలో 3 డివిజన్లు, 46 మండలాలలో జిల్లా పరిపాలన కొనసాగుతుండేది. జిల్లాల వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాను విభజించి 3 జిల్లాలు 'మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట'గా ఏర్పాటు చేశారు. దీంతో మెదక్ జిల్లాలో 5 కొత్త మండలాలు(మనోహరాబాద్, చిలిపిచెడ్, హవేళీఘణాపూర్, నిజాంపేట, నార్సింగి) మొత్తం 21 మండలాలతో కలిపి మెదక్ జిల్లాను 2016, అక్టోబర్ 11న ఏర్పాటు చేశారు. 2016కు ముందు మెదక్ జిల్లా కేంద్రంలో ఒకే ఒక్క మున్సిపాలిటీ ఉండగా, జిల్లా ఏర్పడిన తర్వాత తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. గతంలో 320 గ్రామ పంచాయతీలు ఉండగా జిల్లా పునర్విభజన తర్వాత 469 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి.

### 32 ఎకరాల్లో సమీకృత కలెక్టరేట్

జిల్లా కేంద్రంలోని ఔరంగాబాద్ శివారులో 32 ఎకరాల స్థలంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణానికి రూ.67.07 కోట్లు కేటాయించారు. అన్ని హంగులతో అధునాతన సదుపాయాలతో కలెక్టరేట్ భవన నిర్మాణ సముదాయం జీ ప్లస్ -2 నాలుగు బ్లాకుల నిర్మాణం చేపట్టారు. ఇందులో కలెక్టర్ బంగ్లాతో పాటు రెండు అడిషనల్ కలెక్టర్, 8 మంది జిల్లా అధికారుల నివాస గృహాలు ఉన్నాయి. ఆగస్టు 23న ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రారంభించారు.



---

*సంగారెడ్డి అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువచేశారు. ఫలితంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందటంతోపాటు అభివృద్ధి ఊపందుకుంది. మరీ ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రజాసమస్యలు సత్వరం పరిష్కారం అయ్యాయి. ఉమ్మడి ఆధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఫలాలు అందాలంటే దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు పాలన చేరువైంది. ఇందు కోసం కొత్త జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీలు, పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అధికార వికేంద్రీకరణకు, పాలనలో పారదర్శకతకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు,దళారీ వ్యవస్థకు తావులేకుండా చేశారు. కలెక్టర్, ఎస్పీ సహా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.*


సంగారెడ్డి పట్టణ వ్యూ

## వికేంద్రీకరణ..

కేసీఆర్ ప్రభుత్వంలో మెరుగైన సేవలు

# ఊపందుకున్న ప్రగతి

- సంగారెడ్డి జిల్లా లో కొత్తగా మూడు రెవెన్యూ డివిజన్లు, 10 మండలాలు ఏర్పాటు
- ఐదు మున్సిపాలిటీలు, 190 పంచాయతీలు
- అధికార వికేంద్రీకరణతో పేదలకు మెరుగైన సేవలు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత సంగారెడ్డి కేంద్రంగా కొత్త జిల్లా మనుగడలోకి వచ్చింది. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోలు, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాలతో కలిసి జిల్లా ఏర్పాటైంది. దీంతో కలెక్టర్, జిల్లా అధికారులు మారుమూల ప్రాంతా ల్లో పర్యటించి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయగలిగారు. సంగారెడ్డిలో నీటిపారుదదల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రహదారుల భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం సంగారెడ్డిలో ఏర్పాటైంది. సంగారెడ్డిలో కొత్తగా పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేశారు. రాయికోడ్, పటాన్‌చెరులో ఏడీఏ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌లో ఈఈ, డీఈ పోస్టులను పెంచింది.

**పంచాయతీలుగా మారిన తండాలు**

కొత్త పంచాయతీల ఏర్పాటుతో తండాలు కాస్త పంచాయతీలుగా మారాయి. జిల్లాలో 2014లో 457 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 647కు చేరుకుంది. కొత్తగా 190 పంచాయతీలు ఏర్పడ్డాయి. అందోలు నియోజకవర్గంలో 29, నారాయణఖేడ్‌లో 88, పటాన్‌చెరులో 13, సంగారెడ్డిలో 14, జహీరాబాద్‌లో 31, హత్నూర మండలంలో 15 జీపీలు ఏర్పాటయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 79 తండాలు పంచాయతీలుగా మారాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో అత్యధికంగా 48 తండాలు పంచాయతీలు మారాయి. జిల్లాలో కొత్తగా ఐదు మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. నగర పంచాయతీగా ఉన్న జోగిపేట-అందోల్‌ను కేసీఆర్ ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చింది. కొత్తగా అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్, నారాయణఖేడ్‌ను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. ఫలితంగా పట్టణాల్లో అభివృద్ధి ఊపందుకుంది.

### సమస్యల పరిష్కారం సులభమైంది



నారాయణఖేడ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడంతో ప్రజల సమస్యల పరిష్కారం సులభమైంది. గతంలో ఆర్డీవో స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యల కోసం సంగారెడ్డికి వెళ్లాల్సి వచ్చేది. నారాయణఖేడ్‌లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటైన తర్వాత ప్రజల ఇబ్బందులు దూరమయ్యాయి. నారాయణఖేడ్ స్థాయి కూడా పెరిగింది.

**- లక్ష్మణ్‌రావు, న్యాయవాది, నారాయణఖేడ్**

### కొత్తగా మూడు రెవెన్యూ డివిజన్లు

సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ప్రభుత్వం మూడు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరినా పాలకులు పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న తలంపుతో కొత్తగా జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో కొత్త మండలాల ఏర్పాటుకు ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కొత్తగా పది మండలాలను ఏర్పాటు చేశారు. కంది, గుమ్మడిదల, అమీన్‌పూర్, మొగుడంపల్లి, చౌటకూరు, నాగల్‌గిద్ద, వట్‌పల్లి, సిర్గాపూర్, నిజాంపేట, తడ్కల్ మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్త మండలాల్లో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయటంతోపాటు అసవరమైన సిబ్బందిని నియమించింది. తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుతో భూముల రిజిస్ట్రేషన్లతోపాటు భూ సమస్యల పరిష్కారం సులభతరం అయ్యింది.


కలెక్టరేట్ సముదాయం

### చిన్నమండలంతో సుపరిపాలన



దశాబ్దాలుగాతడ్కల్‌ను మండలకేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను వేడుకున్నాం ఇటీవల బీఆర్ఎస్ ప్రభుత్వం మండలముగా ప్రకటించి, నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇది ఎంతో శుభపరిణామం. దీంతో తడ్కల్‌లోనే మండలస్థాయి కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి. అధికారుల కోసం కంగ్టికి వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు ఆసమస్య తీరిందని చెప్పుకోవచ్చు. తడ్కల్‌ను మండలంగా ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్‌లకు కృతజ్ఞతలు.

**ముప్పిడి విఠల్, ప్రముఖ చిత్రకారుడు, తడ్కల్, కంగ్టి**